

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 30: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి సంబంధించిన ప్రాక్టికల్స్ పరీక్షలు బుధవారం నుంచి మే నెల 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 84 మంది ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇందులో 46 మంది జనరల్ కోర్సు విద్యార్థులు 38 మంది ఒకేషనల్ కోర్సు విద్యార్థులు ఉన్నారన్నారు. పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే హాజరు కావాలన్నారు.

టీడీపీ-జనసే-బీజేపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను మంగళవారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ సహా కూటమి నాయకులు విడుదల చేశారు. మేనిఫెస్టోను పరిశీలిస్తే రాయలసీమ ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. కర్నూలులో తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టత ఇచ్చారు. రాయలసీమను విత్తన రాజధానిగా ఏర్పాటుతో కర్నూలులో మెగా సీడ్ పార్కుకు జీవం పోశారు. సూపర్ సిక్స్ పథకాలను చేర్చి పేదలకు రాబోయే కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టతమైన హామీ ఇచ్చారు. సీమలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అసంపూర్తిగా ఉన్న గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులు పూర్తి చేస్తామని వివరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులకు జీవం వచ్చింది. చేనేతలకు ఉచిత విద్యుత్, జీఎస్టీ రీయింబర్స్ చేస్తామన్నారు. ఎమ్మిగనూరు, కర్నూలు, కోడుమూరు, ఆదోని నియోజకవర్గాల్లో చేనేత కార్మికులకు భరోసా కల్పించారు. జిల్లాలో కరువు.. వలసల నివారణ లక్ష్యంగా రైతు కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు.. రాయితీ, సంక్షేమ పథకాలు ద్వారా స్వయం ఉపాధికి ప్రత్యేక ప్రత్యేక ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు, చేనేత కార్మికులు, అల్పాదాయ వర్గాలు.. ఇలా అన్ని వర్గాల ప్రజలకు అభ్యునతి, రాష్ట్ర ప్రగతిని కాంక్షిస్తూ రూపొందించిన ప్రజా మేనిఫెస్టో అంటూ ఆయా వర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



సూపర్ మేనిఫెస్టో

కర్నూలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)



మేనిఫెస్టో విడుదల చేస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్

- కర్నూలులో హైకోర్టు బెంచ్
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి స్పష్టత
- రాయలసీమ డిక్లరేషన్‌పై ఫోకస్
- పేదల అభ్యున్నతికి 'సూపర్ సిక్స్' వరాలు
- ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వ్యవసాయ కూలీలకు పథకాలు
- విత్తన రాజధానిగా రాయలసీమ.. మెగా సీడ్ పార్కుకు జీవం
- హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా పశ్చిమ మెట్ట పొలాలకు సాగు నీరు
- నదుల అనుసంధానంతో కరువు సీమకు ప్రయోజనం
- చేనేతలకు అండగా ఉచిత కరెంట్
- 'ప్రజాగళం' మేనిఫెస్టోపై సర్వత్రా ప్రశంసలు

కర్నూలులో హైకోర్టు బెంచ్

సీఎం జగన్ మూడు రాజధానుల పేరిట మోసం చేశారు. కర్నూలు న్యాయ రాజధాని అంటూ ఐదేళ్లు దగా చేశారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఓ అడుగు ముందుకేసి జగన్నాథగట్టుపై చుట్టూ పది కిలోమీటర్లు కనిపించేలా హైకోర్టు నిర్మాణం చేస్తామంటూ గారడి మాటలతో మాయ చేశారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ ప్రకటించిన కూటమి మేనిఫెస్టోలో కర్నూలులో హైకోర్టు బెంచ్ తక్షణమే ఏర్పాటు చేస్తామని స్పష్టంగా వివరించారు. దీనిపై న్యాయవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జూన్ 4 తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన ఐదారు నెలల్లో హైకోర్టు బెంచ్ కావచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు స్టైఫండ్, శిక్షణకు ప్రత్యేక ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలులో బీజం పడింది.. మేనిఫెస్టోలో చేరింది



యువగళం పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ చేపట్టి పాదయాత్ర సందర్భంగా పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మినూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో గ్రామాల్లో పెండింగ్ ప్రాజెక్టులు, తాగునీరు, రోడ్లు, ఊళ్లో పనులు లేక వలసలు వెళ్తున్న రైతులు, కూలీలను కళ్లారా చూశారు. కరువు పల్లెలు బాగుపడాలంటే ప్రత్యేక ప్రణాళిక అవసరం అని ఆ రోజే భావించారు. సీమ దాటేలోగా 'రాయలసీమ డిక్లరేషన్' చేపడుతామని కర్నూలులో హామీ ఇచ్చారు. కడపలో ప్రకటించారు. తాజాగా కూటమి మేనిఫెస్టోలో ఆ అంశం చేరింది. అంతేకాదు.. ఇటీవల మంగళగిరిలో లోకేశ్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కర్నూలు జిల్లాలో కరువు, వలస నివారణ, తాగునీటి సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొనడం కొసమెరుపు.

మెగా సీడ్ పార్కుకు ప్రాణం

ఉమ్మడి కర్నూలు జిల్లా జూపాడుబంగ్లా మండలం తంగడంచే వ్యవసాయ క్షేత్రంలోని 3,500 ఎకరాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు మెగా సీడ్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మౌలిక వసతుల కోసం రూ.100 కోట్లు కేటాయించారు. అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జగన్ రాగానే రద్దు చేశారు. తాజాగా కూటమి మేనిఫెస్టోలో రాయలసీమను హార్టికల్చర్ హబ్, విత్తన రాజధానిగా ఏర్పాటు చేస్తామని స్పష్టతంగా పేర్కొన్నారు. దీంతో కరువు రైతుల చిరకాల స్వప్నమైన మెగా సీడ్ పార్కుకు జీవం రానుంది.

కరువు పల్లెకు సాగునీటి కల సాకారం



గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులు సహా రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో ఉంచారు. జిల్లాలో దాదాపు రూ.4 వేల కోట్లతో గత చంద్రబాబు ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులు చేపడితే వైసీపీ నిధులు లేక ఆపేసింది. ఆ ప్రాజెక్టులకు జీవం రానుంది. హంద్రీనీవా అసంపూర్తి పనులు పూర్తి చేసి పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 65 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అదే క్రమంలో నదుల అనుసంధానం చేసి సీమకు సాగునీరు అందిస్తామన్నారు. అదే జరిగే గోదావరి-కృష్ణా-పెన్నా నదులు అనుసంధానం ద్వారా కరువు సీమకు సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ఇది ప్రజా మేనిఫెస్టో



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్, బీజేపీ నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు భరోసా ఇచ్చేలా ఉంది. రైతు కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీ, సంక్షేమ పథకాలు ద్వారా స్వయం ఉపాధి కల్పించడం చరిత్రలో ఇదే ప్రథమం. సూపర్ సిక్స్, రాయలసీమ డిక్లరేషన్, పెండింగ్ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. సీమకు హార్టికల్చర్ హబ్, విత్తన రాజధానిగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో కరువు, వలసలు ఉండవు. యువతకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు, వ్యాపారులు, రైతులు ఇలా అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని తయారు చేశారు. బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు రక్షణ చట్టం, 50 ఏళ్ల పైబడి వారికి రూ.4 వేలు పింఛన్ ఇవ్వడం బీసీలకు అండగా నిలిచారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ తక్షణమే ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం శుభపరిణామం.

-పి.తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఇక చేతినిండా పని దొరుకుతుంది



జగన్ ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక పాలసీ తీసుకురావడంతో ఇసుక కష్టాలు మొదలయ్యాయి. నిర్మాణ రంగం దెబ్బతిన్నది. ట్రాక్టరు ఇసుక రూ.3 వేల నుంచి రూ.5 వేలు వరకు ఉంది. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించారు. నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుంది. మాలాంటి భవన నిర్మాణ రంగ కార్మికులకు చేతినిండా పని దొరుకుంది. మంచి నిర్ణయం తీసుకున్నారు.

- హనుమంతు, భవన నిర్మాణ కార్మికుడు, ఆలూరు

డీఎస్సీ కోసం ఐదేళ్లుగా నిరీక్షణ



జాబ్ క్యాలెండరు అంటే ఏటేటా ఖాళీలు భర్తీ చేస్తారని ఆశించాం. డీఎస్సీ కోసం ఐదేళ్లుగా కళ్లుకాయలు కాసేలా నిరీక్షించాం. ఒక్క డీఎస్సీ కూడా రాలేదు. ఎన్నికల ముందు నోటిఫికేషన్ ఇచ్చినా టీచర్ పోస్టు ఖాళీలు 6 వేలకు తగ్గించి ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు మెగా డీఎస్సీ హామీ ఇవ్వడమే కాకుండా తొలి సంతకం చేస్తానని స్పష్టత ఇచ్చారు. అదే అంశాన్ని కూటమి మేనిఫెస్టోలో పెట్టారు. నాలాంటి వేలాది మంది బీఈడీ, టీటీసీ చేసిన నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగం, భవిష్యత్తుపై ఆశాలు పెంచారు.

- ఎన్.రవిశాస్త్రి, బీఈడీ, ఆలూరు

రైతులకు భరోసా ఇచ్చారు



నాకు ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. బోరు తవ్వకొని టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీ కింద డ్రిప్ వేసుకున్నాను. ఉల్లి, టమోటా, మిరప వంటి పంటలు సాగు చేస్తున్నాను. తాజాగా మేనిఫెస్టోలో రైతులకు అన్నదాత పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం, ధరల స్థిరీకరణకు ప్రత్యేక నిధి వంటి పథకాలు ప్రకటించడం రైతులకు ఎంతో భరోసా ఉంటుంది. చంద్రబాబు చెబితే చేస్తాడు అనే నమ్మకం ఉంది.

-దాసరి ప్రసాద్, యువరైతు, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

మహిళలకు చంద్రన్న వరాలు



సూపర్ సిక్స్ పథకాలతో ఇప్పటికే చంద్రన్న వరాలు ప్రకటించారు. వాటిని మేనిఫెస్టోలో చేర్చి మరింత నమ్మకాన్ని పెంచారు. మహాశక్తి పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ.1,500 ప్రకారం ఏడాది రూ.18 వేలు, ఐదేళ్లకు రూ.90 వేలు ఇస్తామన్నారు. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా భరోసా, గౌరవం కల్పించారు. మా మహిళల మద్దతు టీడీపీకే ఉంటుంది. - తోవి లక్ష్మీనారాయణమ్మ, కోసిగి

చంద్రన్న బీమాతో ధీమా



ఐదేళ్లుగా అసంఘటిత కార్మికులకు ఎలాంటి బీమా అందడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో బీమా సౌకర్యం ఉండేది. చంద్రబాబు ప్రకటించిన కూటమి మేనిఫెస్టోలో చంద్రన్న బీమా పథకం పునరుద్ధరించి ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించడం అసంఘటిత కార్మికులకు భరోసా ఇస్తుంది.

- శేఖర్, హమాలీ కార్మికుడు, ఆదోని

చేనేతలకు ఉచితంగా 200 యూనిట్లు అభినందనీయం



ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు భారీగా పెంచింది. రెక్కాడితే గాని డొక్క నిండని చేనేలకు కరెంట్ బిల్లు కట్టడం భారంతో కూడుకున్నదే. ఇలాంటి సమయంలో చంద్రబాబు మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఉచితంగా 200 యూనిట్లు కరెంట్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడం భరోసాగా ఉంటుంది. చేనేత వస్త్రాలపై చెల్లించే జీఎస్టీ తిరిగి వెనక్కి చెల్లించేలా రియంబర్స్ చేస్తామనడం అభినందనీయం.

- జయమ్మ, చేనేత కార్మికురాలు, ఎమ్మిగనూరు

హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం



కర్నూలు తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ప్రధానంగా చేర్చడం న్యాయవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. ఇది మంచి నిర్ణయం. జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు స్టైఫండ్, శిక్షణకు ప్రత్యేక ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటుపై యువ న్యాయవాదుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

- కేఈ జగదీశ్, టీడీపీ లీగల్ సెల్ కన్వీనర్, కర్నూలు

బీసీలను అణగదొక్కుతున్నారు..

ఎమ్మెల్యే శ్రీదేవిపై మద్దికెర ఎంపీపీ దంపతుల ఆరోపణ



మాట్లాడుతున్న ఎంపీపీ దంపతులు

మద్దికెర, ఏప్రిల్ 30: ఎమ్మెల్యే శ్రీదేవి, మరికొందరు అగ్రవర్ణాల నాయకులు కలిసి బీసీలను అణగదొక్కుతున్నారని ఎంపీపీ డి.అనితాయాదవ్, మాజీ ఎంపీటీసీ డి.శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం మద్దికెరలోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ బలోపేతం కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టి పని చేశామని, కంగాటి శ్రీదేవి గెలుపొందాక మద్దికెర మండలంలో అగ్రవర్ణాలదే ఆధిపత్యమైందని అన్నారు. ఎంపీపీగా గెలుపొంది ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బసినేపల్లి గ్రామంలో పేదలకు అందే పింఛన్ కూడా తమ బంధువులన్న సాకుతో తొలగించారని విచారం వ్యక్తం చేశారు. ఎంపీపీనై ఉండి కూడా తన కార్యాలయంలో పని జరగనప్పుడు ఎందుకీ పదవులు అని అన్నారు. ఎలాంటి ఓటు బ్యాంకు లేని ముగ్గురు నాయకులు మద్దికెరలో వైసీపీని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లినా వారికే ప్రాధాన్యత ఇస్తూ తమను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.20లక్షలు ఖర్చు పెట్టి ఎంపీపీ ఎన్నికల్లో అందరినీ గెలిపించుకున్నప్పటికీ తమకు మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డిని కూడా తమ డబ్బుతో గెలిపించామని, ఎమ్మెల్యే శ్రీదేవి జడ్పీటీసీకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పత్తికొండలో జరిగిన ముఖ్యమంత్రి సభలో ఎమ్మెల్యే శ్రీదేవి కనీసం అపాయింట్‌మెంటు కూడా ఇవ్వలేదన్నారు. వైసీపీ అగ్రవర్ణాల ఆధిపత్యం చూస్తుంటే రాజకీయమే వదిలేద్దామని బాధ కలుగుతోందన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా వైసీపీని అంటిపెట్టుకుని ఉన్నామని, పార్టీ మార్పే ఆలోచన కూడా రాలేదన్నారు. అయితే.. కార్యకర్తల అభీష్టం మేరకు ముందుకు సాగాలని అనుకున్నామని తెలిపారు.

ఓటరు స్లిప్పులను పంపిణీ చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: ఓటరు స్లిప్పులను నాలుగు రోజుల్లోగా పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన అధికారులను టెలి కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. మంగళవారం ఓటరు స్లిప్పు డిస్ట్రిబ్యూషన్, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు, ఈవీఎం కమిషనింగ్, పింఛన్ పంపిణీ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు స్లిప్పులు ఇచ్చే సమయంలో ఏ పోలింగ్ కేంద్రంలో, ఏ సీక్వెన్స్‌లో వారి ఓటు ఉందనే విషయాన్ని తెలియజేస్తే ఓటర్లకు గందరగోళం ఉండదని అధికారులకు సూచించారు. మే 1వ తేదీన పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎసెన్షియల్ సర్వీసెస్, పోలీసు, పీవో, ఏపీవో, ఓపీవోలకు ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఇండెలిబుల్ ఇంక్ వేయాలని ఆదేశించారు. 75 శాతం మందికి పింఛన్ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, మిగిలిన 25 శాతం మందికి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురళి, ఆలూరు ఆర్వో రాము నాయక్ పాల్గొన్నారు.

కురవలను రాజకీయంగా గుర్తించిన చంద్రబాబు

ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన కురవలను రాజకీయంగా టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించారని కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి మండలం చుంచు ఎర్రగుడి, సంగాల గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుతో కలిసి ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వెళ్లిన ఎంపీ అభ్యర్థి నాగరాజుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే హంద్రీనీవా అసంపూర్తి పనులు, ఆర్డీఎస్, వేదవతి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తాను అన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయిస్తా అన్నారు.



బస్తిపాటి నాగరాజును సన్మానిస్తున్న గ్రామస్థులు

వైసీపీ నేతల నుంచి రక్షణ కల్పించండి

కర్నూలు, ఏప్రిల్ 30: వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కర్నూలు నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి ఇంతియాజ్ బాషా తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత వైసీపీకి చెందిన కొంత మంది తనకు ఇంటికి వచ్చి బెదిరించారని అన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరించారని ఆయన ఆరోపించారు. వైసీపీ నాయకుల బెదిరింపులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఆ సమయంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అక్కడకి వచ్చి, తనను బెదిరించిన వారితో మాట్లాడి వెళ్లిపోయారన్నారు. నామినేషన్ విత్‌డ్రా చేసుకుని ఊరు వదిలి వెళ్లిపోవాలని, లేదంటే చంపుతామని బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు. పోలీసులు తనకు, తన కుటుంబానికి మహబూబ్ ఆలీ, షేక్షా అనే వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై వన్‌టౌన్ సీఐ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. బాధితుడు ఫిర్యాదు చేసింది వాస్తవమేనని, ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

పింఛన్.. టెన్షన్

బ్యాంకు ఖాతాలో జమ చేస్తే ఇబ్బందులే..



పెద్దఓబులేసు, అంధుడు, హరివరం

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 30 : మండలంలోని పింఛనుదారులకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఏప్రిల్‌లో పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది తమ సొంత గ్రామాల్లోనే పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మే నెల పింఛను సొమ్మును లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో పింఛనుదారుల్లో ఆందోళన మొదలైంది. బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేయడం వల్ల ఇబ్బందులు తప్పవని హరివరం గ్రామానికి చెందిన పింఛన్‌దారులు పెద్ద ఓబులేసు, జయమ్మ ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారు గ్రామం నుంచి 15 నుంచి 30 కి.మీ దూరం వెళ్లి డబ్బులు తెచ్చుకోలేని పరిస్థితి. ఇళ్ల వద్దనే ప్రభుత్వం పింఛన్ సొమ్ము అందజేయాలని కోరుతున్నారు.



జయమ్మ, వితంతు పింఛనుదారు, హరివరం

గోడ దూకుళ్లపై రచ్చబండ సంభాషణ

రంగన్న : ఏందిరో నాగన్నా. యాడికి పొద్దున్నే పోతున్నావు

● **నాగన్న :** నీకు తెలవందేముందిలే మామ.. ఓట్లొచ్చినాయిగదా మనలాంటోళ్లకు ఇట్టాటప్పుడే గిరాకీ ..

● **రంగన్న :** అవ్రనో నువ్వు సెప్పేది నిజమే .. నాయకులకు మనం గుర్తుకొచ్చేది ఇసువంటప్పుడేరోయ్ ..

● **నాగన్న :** మరి మనమిప్పుడే నాలుగురాళ్లు యనకేసుకోవాలి .. మళ్లా వాళ్లు మనకు దొరకరుగదా మామ ..

● **రంగన్న :** అవ్రనా నాగన్న .. మన సందోళ్లేందిరా మొన్న నాగిరెడ్డి పార్టీలో చేరిరి. నిన్న గంగిరెడ్డి పార్టీలో కనబడిరి.

● **నాగన్న :** అదా మొన్న మనూరి నాయకుడు మంచికి ఐదొందలు, మందు, బిర్యాని అంటే అట్టా పోయిరి. వాళ్ల జెండా కప్పుకుండిరి. నిన్నేమో ఈ పార్టోళ్లు మంచికి వెయ్యి, బిర్యాని అనిరి. వాళ్లకేమైనా దుడ్లు సేదా మామ నిన్న వీళ్లమ్మడి పోయి ఈ జెండా కప్పుకుండిరి.

● **రంగన్న :** ఓర్నీ మనోళ్లు కూడా జెండా మార్సడంలో లీడర్లను మించుతున్నార్రోయ్ ..

● **నాగన్న :** అంతేగదా మామ .. సరే సరే మనోళ్లు ఫోన్ జేచ్చన్నరు పోయొచ్చా. ఈయాల దుగ్గిరెడ్డి పార్టీకి పోతన్నాం ..

● **రంగన్న :** సర్లే .. పోతేపోతివిగానీ ఒకమాట సెప్తా ఇనురా. ఇట్టా జెండాలు మార్శితే దుడ్లొస్తాయోమోగానీ ఎవ్వరి కాడా ఇలువ వుండదురా నాగన్నా ..

- కొలిమిగుండ్ల రూరల్



తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం

నాయకుడికి నిబద్ధత ఉండాలి



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే మేము మంచి నాయకుడిని ఎన్నుకుంటాం. మంచి నాయకుడి వల్లే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. యువత భవిష్యత్తుకు ఆధారమైన పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చే వారే కావాలి. ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడిని ఎన్నుకుంటాం.

- సయ్యద్ అల్తాఫ్, డిగ్రీ, చాగలమర్రి

ఓటు హక్కు బాధ్యతగా తీసుకోవాలి



ఓటును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. తన ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవడంతోపాటు దీనిని తన గెలుపుగా భావించాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. తన ఓటు తన భవిష్యత్తుగా ఓటరు భావించాలి. ఐటీ పరిశ్రమలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

- సయ్యద్ కరిముల్లా, డిగ్రీ, చాగలమర్రి

ఓటుపైనే మన భవిష్యత్తు



విజ్ఞానవంతులైన విద్యార్థులు మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే సమాజం బాగుంటుంది. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆ దిశగా ఆలోచన చేసే నాయకుడిని మాత్రమే ఎన్నుకోవాలి. డబ్బు ప్రభావానికి గురి కాకుండా ఓటు వినియోగించుకోవాలి.

- సాదిక్ ఆలీ, డిగ్రీ, చాగలమర్రి

కుడి చేతి వేలికి సిరా ఎవరికి వేస్తారో తెలుసా..!



ఆత్మకూరు, ఏప్రిల్ 30: ఎన్నికల్లో సాధారణంగా రెండో సారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా గుర్తు వేస్తారు. ఓటర్ల సహాయకులుగా వచ్చిన వారికి మాత్రం కుడి చేతి చూపుడు వేలిపై వేస్తారు. ఎవరైనా ఓ వ్యక్తి కుడి, ఎడమ చేతి చూపుడు వేళ్లకు సిరా గుర్తు ఉన్నట్లయితే అతడు తన ఓటు వేయడంతోపాటు ఇంకో వ్యక్తికి సహాయకుడిగా వెళ్లి ఓటు వేశాడని అర్థం. అయితే ఒక పోలింగ్ బూత్ పరిధిలోని వ్యక్తి అదే పోలింగ్ బూత్ పరిధిలోని ఓటరుకే సహాయకుడిగా ఉండాలే కానీ వేరు పోలింగ్ బూత్‌లోని ఓటరుకు సహాయకుడిగా ఉండరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా తెలంగాణ గత అసెంబ్లీ ఎన్నికల వేళా కేంద్ర ఎన్నికల సంఘం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులు, వయోవృద్ధులను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకొచ్చే ఓటు వేయించే సహాయకుల కుడిచేతి చూపుడు వేలుకు సిరా గుర్తు చేయాలని వెల్లడించింది.

ఓటర్లకు ఎడమ చేతి చూపుడు వేలుకు మాత్రమే సిరా ఎందుకు వేస్తారంటే :

మనదేశంలో చాలా మంది కుడిచేతి వాటం కలిగిన వారే ఉంటారు. కుడి చేతిపై తడి సిరా వేస్తే బ్యాలెట్ సందర్భంలో బ్యాలెట్ పత్రాన్ని పాడు చేసే అవకాశం ఉంటుందని ఎడమ చేతిని ఎంచుకున్నారు. ప్రస్తుతం ఈవీఎంల వినియోగం సందర్భంలో కూడా కుడి చేసి చూపుడు వేలుకు సిరా ఉంచినట్లయితే ఈవీఎంలకు సిరా ఇంకు అంటించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కుడి చేతికి సిల్వర్ నైట్రేట్ మొదలైన రసాయనాలతో కూడిన సిరా అంటించినట్లయితే తినే ఆహారంలో కలిసే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎడమ చేతి చూపుడు వేలు మీద సిరా వేస్తే మిగతా వేళ్ల కంటే సౌకర్యవంతంగా ఉంటుందని ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.



ఆదర్శ రాజకీయవేత్త

● ప్రజాసేవకే రూ. కోట్ల ఆస్తులు ● నంద్యాల గాంధీగా నీరాజనాలు
● నంద్యాల పురపాలక సంఘం మొట్టమొదటి చైర్మన్‌గా చెరగని ముద్ర
● వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకి
● ఈ ఎన్నికల వేళ స్మరించుకోవలసిన మహామనిషి కాదర్‌బాద్ నరసింగరావు



అప్పటి బ్రిటీష్ అధికారులతో కాదరబాద్ నరసింగరావు (మధ్యలో పంచ, మెడలో కండువా వేసుకున్న వ్యక్తి)

ఎన్నికల సందర్భంలో గుర్తు చేసుకోవలసిన మహా వ్యక్తి కాదరబాద్ నరసింగరావు. సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో, రాజకీయాల్లో కొనసాగినా మచ్చ పడని నిష్కళంక నాయకుడు. అచ్చమైన గాంధేయవాదిగా జీవించి నంద్యాల గాంధీగా పేరు పొందారు. నాలుగేళ్లు రాజకీయాల్లో ఉంటే కోట్లకు పడగలెత్తి, వారసత్వ రాజకీయాలను కొనసాగిస్తున్న ఈ రోజుల్లో నరసింగరావు ఆదర్శాలు అపురూపమనిపిస్తాయి.

- నంద్యాల టౌన్

నంద్యాల పురపాలక సంఘం 1899లో ఆవిర్భవించింది. అప్పటి నుంచి 1920 వరకు బ్రిటీష్ పాలనలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలనాయంత్రాంగం నడిచింది. అయితే అప్పటికే మహాత్మాగాంధీ ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని నరసింగరావు నంద్యాలలో ప్రతి ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తుండే వారు.

● ఈ నేపథ్యంలో 1920 నుంచి 1934 వరకు నంద్యాల పురపాలక సంఘానికి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా కొనసాగారు. 1934 నుంచి 1962 వరకు నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 28 సంవత్సరాలు కొనసాగారు. ఏ పదవిలో ఉన్నా అజాతశత్రువుగా నరసింగరావు ప్రజల మన్ననలను పొందారు.

● 1947లో, 1952లో దళితోద్ధరణకు ఎంతగానో కృషి చేశారు. దళితులకు ప్రత్యేక హాస్టళ్లను నెలకొల్పి, విద్యారంగంలో వాళ్లు ఉన్నత స్థాయికి చేరుకోడానికి దోహదం చేశారు.

● గ్రంథాలయ ఉద్యమనేత గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో నరసింగరావు నంద్యాల కేంద్రంగా రాయలసీమ అభివృద్ధికి కోసం అప్పట్లోనే సమావేశాలు నిర్వహించారు. పెద్ద మనుషుల ఒప్పందం శ్రీబాగ్ ఒడంబడికకు కృషి చేశారు.

● నంద్యాల పట్టణ నడిబొడ్డున ప్రస్తుతం ఉన్న మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయానికి తన భూమిని దానం చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలకు పురపాలక శాఖ కాదరబాద్ నరసింగరావు మెమోరియల్ పాఠశాలగా 2005లో నామకరణం చేశారు. దీని విలువ రూ.కోట్లల్లో ఉంది.

● నంద్యాల పట్టణం నుంచి భీమవరానికి వెళ్ళే రస్తాలో నరసింగరావు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కుందూనదిపై బ్రిటిష్ హయంలో నిర్మించిన బ్రిడ్జిపై ఇప్పటికీ రాకపోకలు జరుగుతున్నాయి.

● వ్యవసాయ రంగ అభివృద్ధిలో చెరువు కట్ట ఆయకట్టు భూముల్లో అనాడే విప్లవాత్మక వ్యవసాయ రంగానికి పునాదులు వేశారు.



● భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, జాతిపిత మహాత్మాగాంధీ, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, కల్లూరి సుబ్బారావు, తెన్నేటి విశ్వనాథం, కళా వెంకటరావు, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, భోగరాజు రామచంద్రరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, గాడిచెర్ల ఇలా ఎందరో అతిరథ మహారథులు నంద్యాలకు వచ్చి కాదరబాద్ నరసింగరావు ఇంట్లో ఆతిథ్యం స్వీకరించేరు.

● ఆంధ్రతిలక్ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు కొన్నేళ్ళ పాటు నంద్యాలలో నివాసం ఉన్నారు. కాదరబాద్ నరసింగరావుకు అత్యంత సన్నిహితుడిగా మెలిగి, ఆయన నిస్వార్థ సేవలను గమనించి నంద్యాల గాంధీ అని గౌరవించారు.

● వారసత్వ రాజకీయాలను వ్యతిరేకి :

కాంగ్రెస్‌పార్టీలో దేశస్థాయిలో నాయకులకు ఆప్తునిగా మెలిగిన నరసింగరావు తన కుటుంబంలో వారసత్వ రాజకీయాలను కొనసాగించదల్చుకోలేదు. ఏడు మంది కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నా, వీరు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారేగాని తండ్రి ప్రాపకంతో రాజకీయల వైపు తొంగి చూడలేదు.

● నంద్యాల గాంధీపై ప్రత్యేక పుస్తకం :

1888 నుంచి 1963 వరకు నరసింగరావు జీవిత చరిత్రను నంద్యాల గాంధీ పేరుతో ప్రముఖ రచయిత గొట్టిముక్కల సుబ్రహ్మణ్యం శాస్త్రి రాశారు. ఈ పుస్తకావిష్కరణకు శాసన మండలి చైర్మెన్ చక్రపాణియాదవ్, ప్రముఖులు ఎన్ఎండీ ఫరూక్, శిల్పా మోహన్‌రెడ్డి, డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్, ఎందరో రాజకీయాలకు అతీతంగా హాజరయ్యారు. అలాగే మున్సిపల్ హైస్కూల్‌లో కాదరబాద్ నరసింగరావు కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



కాదరబాద్ నరసింగరావు కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

వారసత్వంగా రాజకీయాలను ప్రోత్సహించలేదు



మా నాన్న మమ్మల్ని రాజకీయాల వైపు ప్రోత్సహించలేదు. కేవలం సభలు, సమావేశాలకు నిర్వహణ బాధ్యతలను మాత్రం నేను చూసుకొనేవాడిని. అప్పట్లో పదవులు మనిషిని బట్టి వాటికవే వచ్చేవి. నిస్వార్థంగా ప్రజా సేవ చేసిన ఎందరో మహానుభావుల్లో మా నాన్న ఒకరు.

- డాక్టర్ రవీంద్రనాథ్, కాదరబాద్ నరసింగరావు ఐదో కుమారుడు, అంతర్జాతీయ పత్తి శాస్త్రవేత్త

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఈవో

శ్రీశైలం, ఏప్రిల్ 30: శ్రీశైలం దేవస్థానం పరిధిలో దేవదాయ ధర్మాదాయ చట్టం నియమ నిబంధనల ప్రకారం 2024 ఎన్నికల్లో దేవస్థానం పరిధిలో చట్టాలను ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు రాజకీయ పార్టీలను హెచ్చరించారు. దేవదాయ చట్టం ప్రకారం ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలకు సంబంధించిన గుర్తులు, కండువాలు వేసుకుని దేవస్థానం పరిధిలోని ప్రధాన వీధుల్లో దుకాణాల వద్ద, సత్రాల వద్ద, కార్యాలయాల వద్ద ప్రచారం నిర్వహించడం పూర్తిగా నిషిద్ధమని ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక దేవస్థానంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ లేబర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పార్టీ నాయకులను కలవడం, ఫొటోలు దిగటం, ప్రచారంలో పాల్గొనడం జరిగినట్లు దేవస్థానం దృష్టికి వచ్చినట్లైతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దేవస్థానం మైక్ ద్వారా ఈ విషయాన్ని క్షేత్రపరిధిలో విస్తృతంగా ప్రచారం చేశారు.




సెక్షన్ 49(పీ)...

కర్నూలు, ఏప్రిల్ 30: ఎన్నికల పోలింగ్ రోజున దొంగ ఓట్ల వల్ల లేక ఇతర కారణాలతో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు తిరిగి దాన్ని సాధించుకునే హక్కును భారత ఎన్నికల సంఘం 1961లో తీసుకొచ్చిన సెక్షన్ 49(పి) అవకాశం కల్పిస్తోంది.

సెక్షన్49(పీ) ద్వారా ఓటు పొందాలనుకునేవారు ముందుగా ప్రిసైడింగ్ అధికారిని కలవాలి. ఓటు కోల్పోయిన వ్యక్తి మనమేనని ఆయన ముందు నిరూపించుకోవాలి. అందుకోసం ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. ఎన్ఆర్ఐలు అయితే.. పాస్‌పోర్టు చూపించాలి. అప్పుడు ప్రిసైడైంగ్ అధికారి ఇచ్చే ఫామ్ 17(బీ)లో పేరు, సంతకం చేసి ఇవ్వాలి. అప్పుడు వెనుకవైపు తన సంతకంతో ఉన్న టెండర్డ్ బ్యాలెట్ పేపర్‌ను ప్రిసైడింగ్ అధికారి మనకు ఇస్తారు. దానిపై మనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి తిరిగి ప్రిసైడింగ్ అధికారికి ఇవ్వాలి. ఆయన ప్రత్యేక కవర్‌లో ఆ ఓటును భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. సెక్షన్ 49(పి) ద్వారా పొందే ఓటు హక్కును ఈవీఎం ద్వారా వేసేందుకు అనుమతి ఇవ్వరు. 49(పి) సెక్షన్ ద్వారా పొందే ఓటు హక్కును టెండర్డ్ ఓటు అని పిలుస్తారు. మొత్తం ఓట్లలో ఈ ఓటును అదనపు ఓటుగా గుర్తిస్తారు. కౌంటింగ్ రోజున మిగతా ఓట్లును లెక్కించిన తర్వాతనే ఈ ఓటుకు ప్రాధాన్యత ఉంటుంది. గెలుపు ఓటముల్లో ఈ ఓటు అవసరాన్ని బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ఓటు ద్వారా సాధ్యమవుతుందని భావించినప్పుడు మాత్రమే ఈ ఓటును లెక్కిస్తారు.

1909లోనే భారతీయులకు ఓటు హక్కు

శిరివెళ్ల, ఏప్రిల్ 30 : స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై భారతీయులు సాగించిన పోరాటాల్లో ఓటు హక్కు ఉద్యమం కూడా ఒకటి. నాటి పాలనలో అంతర్భాగమైన స్థానిక సంస్థలకు 1907లో నిర్వహించిన ఎన్నికల్లో భారతీయులకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమం సాగించారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ సిఫారసుల ఫలితంగా 1909లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ చట్టం ప్రకారం కొద్ది మంది భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. అప్పటి నుంచి కొనసాగిన ఉద్యమాలతో 1935లో ఓటు హక్కును విస్తృతం చేస్తూ భారతీయుల ఓటు హక్కు శాతాన్ని 10.6 శాతానికి పెంచారు. అనంతరం జరిగిన రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం ప్రజలకు ఓటు హక్కు వచ్చింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించాక ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి భారత రాజ్యాంగం 326 అధికరణ ప్రకారం 21 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు అమలు చేశారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయో పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది.



హ్యాట్రిక్ ఎంపీ ఎస్పీవై రెడ్డికి మరణానంతరం ఓటమి

● 15 సంవత్సరాలు వరుసగా పార్లమెంట్ సభ్యుడిగా రికార్డు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 30 : ఉమ్మడి జిల్లా నుంచి పార్లమెంట్‌కు ఎంతో మంది రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, వరుస విజయాలతో హ్యాట్రిక్ ఎంపీగా ఎస్పీవైరెడ్డి రికార్డు సాధించారు. 15 సంవత్సరాల పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన ఆయన చనిపోయాక పార్లమెంట్ ఎన్నికల్లో ఓడారు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో నంద్యాల ఎంపీ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ ఎస్పీవైరెడ్డి ఫలితాలకు ముందే మరణించారు. ఫలితాల్లో మూడో స్థానంలో నిలిచారు. నంద్యాల, కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి రాజకీయ ఉద్దండులు ఎంపీలుగా ఎన్నికై రాజకీయాల్లో రాణించారు. 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పీవీ రంగయ్య నాయుడుపై విజయం సాధించి మొదటి సారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపై భూమా నాగిరెడ్డి పోటీ చేసి రెండోసారి ఎంపీగా గెలుపొందారు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపైనే టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి పోటీ చేసి గెలుపొంది వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించినప్పటికీ 8 సంవత్సరా లు మాత్రమే భూమా నాగిరెడ్డి ఎంపీ పదవిలో ఉన్నారు.

చనిపోయాక ఓడిన ఎస్పీవైరెడ్డి..:

2004లో టీడీపీ అభ్యర్థి భూమా శోభానాగిరెడ్డిపై 1,11,679 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్పీవై రెడ్డి మొదటిసారిగా ఎంపీగా గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై 90,847 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి ఘన విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి వైసీపీలో చేరిన ఎస్పీవైరెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై 1,05,766 ఓట్లతో మూడోసారి ఎంపీగా గెలిచారు. హ్యాట్రిక్ సాధించిన ఎస్పీవైరెడ్డి గెలిచిన వారం రోజుల్లోపే సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019 సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ముందు వరకు టీడీపీలోనే ఎస్పీవైరెడ్డి కొనసాగారు. నంద్యాల సిట్టింగ్ ఎంపీగా తెలుగుదేశం టికెట్‌ను దక్కకపోవడంతో జనసేన గూటికి చేరారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాండ్ర శివానందరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పోచా బ్రహ్మానందరెడ్డిలకు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థిగా నంద్యాల పార్లమెంట్ బరిలోకి ఎస్పీవైరెడ్డి దిగారు.



అయితే పోలింగ్‌కు ముందు నుంచే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2019 ఏప్రిల్ 30వ తేదీన మృతి చెందాడు. ఆ ఎన్నికల ఫలితాలలో నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి 2,50,119 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో పోచాకు 7,20,888 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి మాండ్ర శివానందరెడ్డికి 4,70,769 ఓట్లు వచ్చాయి. హ్యాట్రిక్ ఎంపీగా జిల్లాలో చక్రం తిప్పిన ఎస్పీవైరెడ్డి (జనసేన)కి 38,871 ఓట్లు వచ్చాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఎస్పీవైరెడ్డి 15 సంవత్సరాలు పూర్తి కాలం పదవిలో ఉండి చివరిలో మరణానంతరం ఓడిపోయిన వ్యక్తిగా రాజకీయ పుటల్లో నిలిచారు.

ప్రచార వాహనాలకూ లెక్క చెప్పాల్సిందే..!



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 30: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇష్టానుసారంగా వాహనాల కాన్వాయ్ ఉపయోగిస్తే చర్యలు తప్పవని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ప్రచారానికి ఉపయోగించే వాహనాల లెక్క పక్కాగా చెప్పాల్సిందేనని ఎన్నికల చట్టం చెబుతోంది. ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికి సంబంధిత ఎన్నికల అధికారి నుంచి పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. పర్మిట్ పొందిన వాహనాల ఖర్చును అభ్యర్థి రోజువారీ లెక్కల్లో తప్పనిసరిగా చూపాల్సి ఉంటుంది. ఒకవేళ పర్మిట్‌లేని వాహనాన్ని ఉపయోగిస్తే అభ్యర్థి అనధికారికంగా ప్రచారం నిర్వహిస్తున్నాడని పరిగణిస్తారు. భారత శిక్షాస్మృతిలోని 9-ఏ నిబంధనల ప్రకారం అభ్యర్థిపై చర్యలు చేపడతారు. దీంతోపాటు ప్రచారం నుంచి సదరు అభ్యర్థిని తొలగిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఫలితాలు వెలువడిన 30రోజుల్లో ప్రచార వాహనాల ఖర్చుతో సహా, అభ్యర్థి ఖర్చులన్నీ రశీదులు, ఓచర్లతో సహా సమర్పించాల్సి ఉంటుంది. లేదంటే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 10ఏ నిబంధన కింద కేంద్ర ఎన్నికల సంఘం త్రీవ చర్యలకు ఉపక్రమిస్తుంది. ఎన్నికైన తరువాత పదవి కోల్పోవడంతో పాటు, మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేకుండా నిషేధిస్తుంది.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవడానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోవాలన్నా, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందే దరఖాస్తు చేసుకున్నట్లయితే.. అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి వచ్చే ఓటరు 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకుని వచ్చే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థి వ్యయం రూ.40 లక్షలు మించరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి పాణ్యం నియోజకవర్గానికి బీ క్యాంపులోని బాయ్స్ స్కూల్లో 5, 6, 7, 8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

ఊసరవెల్లి రాజకీయం

- 2017లో ఎంవీఎస్ స్కీంకు అప్పటి ఎమ్మెల్యే బీవీ శంకుస్థాపన
- 2019 తరువాత నిధులను నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల వేళ భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



గాజులదిన్నె దగ్గర నిర్మాణ పనులు పూర్తయిన ఓహెచ్ఆర్ ట్యాంక్

గోనెగండ్ల, ఏప్రిల్ 30: వైసీపీ ఊసరవెల్లి రాజకీయానికి ఇదో నిదర్శనం. 2017లో ఎంవీఎస్ స్కీంకు అప్పటి ఎమ్మెల్యే బీవీ శంకుస్థాపన చేయగా 2019 వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపేసింది. ఓట్ల కోసమని మార్చి 13న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక హడావుడిగా భూమి పూజ చేపట్టారు. ఎవరిని మభ్యపెంటేందుకు ఈ భూమి పూజ పనులు చేపడుతున్నారో ప్రజలకు అంతుచిక్కడం లేదు. మండల పరిధిలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్టీవిలేజస్ స్కీం కింద 13.50 కోట్లు విడుదల చేసింది. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి 2017 ఏప్రిల్‌లో భూమి పూజ చేశారు. 2017 డిసెంబరు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పథకం కింద హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎర్రబాడు, కులుమాల గ్రామాల్లో ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతో ఈ పథకానికి సంబంధించిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో హుటాహుటిన ఎంవీఎస్ స్కీంకు రూ. 19.50 కోట్లు నిధులు కేటాయించామని, 11 గ్రామాలకు అదనంగా మరో 3 గ్రామాలను చేర్చి 14 గ్రామాలకు నీరు అందించేందుకు గాను టెండర్ వర్క్‌పూర్తి అయిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మళ్లీ భూమి పూజ చేశారు.



2017లో మల్టీ విలేజస్ స్కీంకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే బీవీ(ఫైల్)

ఎన్ని సార్లు భూమి పూజ చేస్తారు



ఎంవీఎస్ స్కీం పనులకు గాను 2017లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. చాలా వరకు పనులు పూర్తి అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో నిలిచిపోయాయి. ఎన్నికలు వచ్చినందున వైసీపీ నాయకులు తాము ఏదో చేశామని చెప్పేందుకు మళ్లీ భూమి పూజ చేశారు. వైసీపీ నాయకులు ఎవరిని మోసం చేసేందుకు వస్తున్నారో అర్థం కావడం లేదు.

- రామకృష్ణ, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, గాజులదిన్నె



2024 మార్చి 13న గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర మళ్లీ భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక



సగంలోనే నిలిచిపోయిన అప్పటి బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు

ఓట్ ఫ్రమ్ హోమ్...



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 30: ఓట్ ఫ్రమ్ హోమ్ మీరు వినే ఉంటారు. గత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం దీనిని ప్రవేశపెట్టింది. గత సంవత్సరం తెలంగాణలో కూడా హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఈ నెల 13న ఎన్నికలు జరగబోతున్నాయి. అందువల్ల ఈ నెల 6 నుంచి 8 లోపు ముగించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

హోమ్ ఓటింగ్ అంటే: హోమ్ ఓటింగ్ అంటే ఇంటి నుంచే ఓటు వేయడం. 80 ఏళ్లు దాటినవారు, దివ్యాంగులు ఇంటి నుంచే బ్యాలెట్ విధానంలో ఓటు వేయవచ్చు. దివ్యాంగుల్లో 40 శాతం వైకల్యం ఉన్న వారు ఈ సదుపాయం పొందవచ్చు. ఈ విధానంలో వేసే ఓటు..బ్యాలెట్ బాక్సుల్లో ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ రోజు ఈ ఓట్లను కూడా లెక్కిస్తారు.

అర్హులు వీరే: ఓట్ ఫ్రమ్ హోమ్‌కు ముందుగా 12-డి ఫారం సమర్పించాలి. ఆ ఫారం సమర్పించిన వారు మాత్రమే ఇలా ఓటు వేయడానికి అనుమతి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికే ఎన్నికల సిబ్బంది వస్తారు. వచ్చే ముందు సమాచారం ఇస్తారు. ఆ రోజున ఓటు వేయాలనుకేనే వారు అందుబాటులో ఉండాలి. ఎన్నికల సిబ్బంది తమతో బ్యాలెట్ బాక్సును తీసుకువస్తారు. అందులో ఓటు వేయవచ్చు. ఓటు ఎవరికి వేశామన్నది ఇతరులకు తెలిసే అవకాశం ఉండదు. మన ఇంటికి గెజిటెడ్ ఆఫీసర్, అసిస్టెంట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది వస్తారు. ఈ టీమ్ వచ్చినప్పుడు మీరు ఇంట్లో లేకపోతే, మరో రోజు కూడా ఇంటికి వచ్చేలా ప్లాన్ ఉంది. అయినప్పటికీ మొదటిసారి వచ్చినప్పుడే ఓటు వేసేలా ప్లాన్ చేసుకోవడం మంచిది.

అయోమయంలో ఎన్నికల సిబ్బంది...!





కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరికీ పోస్టు బ్యాలెట్ అవకాశం కల్పించింది. ఈ మేరకు వారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. మే నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుంది. అత్యవసర సేవలకు సంబంధించిన వారికి మే నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించారు. జిల్లాలోని పీవోలు, ఏపీవోలకు రెండు శిక్షణా తరగతులను పూర్తి చేశారు. మే 1వ తేదీన సంబంధిత నియోజకవర్గంలో మూడో విడత శిక్షణా తరగతులను రిటర్నింగ్ అధికారి సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సిబ్బందికి మెసేజ్‌లు కూడా వచ్చాయి. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు దాదాపు 18వేలు దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది ఫారం-12, ఫారం-12డీ సంబంధిత ఆర్వో కార్యాలయంలో అందజేశారు. దరఖాస్తులు అందజేసిన తర్వాత అధికారులు ఎటువంటి రశీదు ఇవ్వలేదని ఎన్నికల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన దరఖాస్తు అంగీకరించబడినదా.. లేదా తిరస్కరణకు గురైందా అని ఎన్నికల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగీకరించబడిన దరఖాస్తు లు ఫోన్ నెంబర్లకు ఎటువంటి మెసేజ్‌లు కూడా రాలేదని ఎన్నికల సిబ్బంది చెబుతున్నారు. కానీ ఎన్నికల విధులకు మాత్రం కచ్చితంగా హాజరు కావాలని అధికారులు మెసేజ్‌లు పంపుతారని చెబుతున్నారు. ఇంతకూ తమ ఓటు హక్కు ఉందా లేదా అని ఎన్నికల సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆమోదం పొందబడిన దరఖాస్తుల ఫోన్ నెంబర్లకు మెసేజ్‌లు పంపాలని ఎన్నికల సిబ్బంది కోరుతున్నారు.

మీ బిడ్డల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ



మీ బిడ్డల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ అంటూ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ భరోసా ఇచ్చారు. మంగళవారం రాత్రి డోన్ నియోజకవర్గంలోని సిమెంటునగర్‌లో టీడీపీ అభ్యర్థి భర్త కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో చంటిబిడ్డను ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించారు. టీడీపీ జెండానే మీ బిడ్డల భవిష్యత్తుకు సురక్షితమని కోట్ల సుజాతమ్మ ఓటర్లకు తెలిపారు.

- డోన్

నాడు డబ్బు సంస్కృతి లేదు

- కార్యకర్తలు ఇళ్ల నుంచే సద్ది తెచ్చుకునే వాళ్లు
- కమ్యూనిస్టులు కూడా గతి తప్పారు
- ఆలూరు మాజీ ఎమ్మెల్యే లోక్ నాథ్

ఆలూరు, ఏప్రిల్ 30:

'కమ్యూనిస్టుతో సహా ఇతర రాజకీయ పార్టీలు నిబద్ధతను కోల్పోయాయి. ఓట్లు, సీట్ల కోసం గతి తప్పి ప్రవర్తిస్తున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న జనం ఆర్థికంగా బలపడడానికి ఏమి చేయాలో ఆలోచించకుండా హామీలతో ఓట్ల కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.' అని ఆలూరు మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ అన్నారు. సాధారణ ఎన్నికల్లో ఆలూరు అసెంబ్లీ నుంచి 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన ఆయనను సోమవారం ఆంధ్రజ్యోతి పలకరించగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

నాది ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం. నేను గోవాలో ఓ రెస్టారెంట్‌లో పని చేస్తుండేవాడిని. నన్ను 1989లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఆలూరు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు రూ.5 లక్షలు ఖర్చు అయింది. అప్పట్లో భోజనాలు, వాహనాలకు మాత్రమే డబ్బు ఖర్చు పెట్టేవాళ్లం. ఓటర్లకు డబ్బులు ఇచ్చే సంస్కృతి లేదు. రెండే రెండు జీపులు ప్రచారానికి వాడాం.. కార్యకర్తలు సైకిల్‌పై వచ్చి ప్రచారంలో పాల్గొనేవారు. సభలు సమావేశాలు ఉన్నప్పుడు కార్యకర్తలు బస్సుల్లో ఇంటి దగ్గర నుంచే సద్దిమూట (అన్నం) తెచ్చుకునేవారు. ఇప్పుడు ఎన్నికలు చూస్తే డబ్బు లేని వాడు ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి. జనం ఓట్లు అమ్ముకుంటున్నారు. రాజకీయ పార్టీలు ఓట్లు కొంటున్నాయి. ఎన్నికల ఖర్చు రూ.కోట్లలో ఉంటోంది. ప్రభుత్వాలకు మద్యం అమ్మకాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందామే కానీ, రాజకీయంగా ఇంకా వెనకబడి ఉన్నామేమో అనిపిస్తుంది. డబ్బు, మద్యం ఎన్నికలను శాసిస్తున్నాయి. ఉద్యమ పార్టీలుగా చెప్పుకునే కమ్యూనిస్టులు కూడా ఒకటి, రెండు సీట్ల కోసం బూర్జువా పార్టీల చెంతన చేరే పరిస్థితి ఏర్పడింది. మేధావులు, విద్యావంతులు, యువకులు, మహిళలు, విద్యార్థులు ఈ విషయంలో ఒక ఆలోచనకు రావాలి. సామాజికంగా చైతన్యం వస్తే తప్ప మార్పు రాదు. పత్రికలు, సీనియర్ జర్నలిస్టులు ప్రజలకు మేలు చేకూరే అంశాలపై ఫోకస్ చేయాలి.. ఎమ్మెల్యేగా గెలిచాక హామీలను, ప్రజాసేవను పక్కన పెట్టి కోట్ల రూపాయలు సంపాదనే ధ్యేయంగా ఎమ్మెల్యేలు తమ స్వార్థాన్ని చూసుకుంటున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సేవ తప్ప డబ్బు సంపాదన ఆలోచన లేదు. ఎమ్మెల్యేగా పని చేసినా సొంత ఇల్లు, కారు కూడా సంపాదించ లేదు. ప్రజలకు సేవ చేస్తే ఆ ఎమ్మెల్యేను ప్రజల గుర్తించుకుంటారు..



మొదలైన ప్రలోభాల పర్వం

- ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్న కార్యకర్తలు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న అభ్యర్థులు
- కాల్ చేసి విజ్ఞప్తి చేసేందుకంటూ వివరణ
- వేర్వేరు నెంబర్ల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్



ఆదోని, ఏప్రిల్ 30: ఇన్నాళ్లు ఒక ఎత్తు.. ఈ 13 రోజులు మరో ఎత్తు అన్నట్టుగా ఎన్నికల ప్రచారం మారింది. ఎన్నికల బరిలో ఉన్న నాయకులు ఓటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రచారం తుది దశకు చేరుకున్న తరుణంలో పోల్ మేనేజ్ మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే కాల్స్ ద్వారా ఓటర్లను పలకరిస్తున్నారు.

● **మొబైల్ నంబర్‌ల సేకరణపై దృష్టి..**

మొబైల్ నెంబర్ల సేకరణపై భిన్న ప్రచారాలు జరుగుతున్నాయి. నగదు బదిలీ కోసం కొందరు వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగదు పంపిణీ క్రమంలో ప్రత్యర్థి పార్టీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వైలెన్స్ టీంలతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ఎలాంటి రిస్క్ లేకుండా ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో కొందరు అభ్యర్థులు ఉన్నట్టు తెలిసింది. ఆదోని నియోజకవర్గంలోని ప్రధాన పార్టీకి చెందిన కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు పర్యటించారు. ఓటు వేయాలని విజ్ఞప్తి కంటే ఇంటింటికీ వెళ్లి ఓటర్ల మొబైల్ నెంబర్ల సేకరణపై వారు ఎక్కువ దృష్టి సారించారు. యూపీఐ లావాదేవీల పైనా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. ఒక నెంబరు నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే... వేర్వేరు వ్యక్తుల యూపీఐ ఖాతాల ద్వారా నగదు బదిలీకి చర్యలు తీసుకుంటున్నారు. పలు ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ఏరియాల్లో స్థానికంగా గుర్తు పట్టని వ్యక్తుల ద్వారా పంపిణీ చేపడుతున్నారు.

● **ప్రలోభాల పర్వంపైనే సన్నిహితులతో చర్చ...**

ఏ ప్రాంతంలో ఎంత పంచాలనే దానిపై అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. ప్రచారం అనంతరం రాత్రి వేళ ప్రలోభాల పర్వంపైనే సన్నిహితులతో చర్చిస్తున్నారు. నియోజక వర్గంలో ఓటుకు రూ.వెయ్యి, మరి కొన్ని నియోజకవర్గాల్లో రూ.2 వేల వరకు ఇవ్వనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఆ కాలనీ ముఖ్య నాయకుడు ద్వారా ఇప్పటికే చెల్లింపులు మొదలైనట్లు తెలిసింది.

● **నిఘా పెంచిన పోలీసులు**

ఇతర ప్రాంతాల నుంచి డబ్బు తరలే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. కోడ్ ఎన్నికలకు ముందున్న ఈ 15 రోజులు నిఘా పెంచి డబ్బు, మద్యం తరలింపునకు కళ్లెం వేయడానికి సిద్ధమయ్యారు. అనుమానిత కేంద్రాలు, జిల్లా సరిహద్దుల వద్ద మరింత బందోబస్తు చేపట్టారు. రూట్‌లో వెళ్లే వాహనాలన్నీ చెక్ చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

జగన్.. ఇచ్చిన హామీ మరిచావా ?

- ఓట్లు తప్ప ప్రజల కష్టాలు పట్టవా
- గోరంట్ల-కొత్తపల్లి బ్రిడ్జి నిర్మాణం ఏమైంది..!
- గెలిచిన నాలుగేళ్లకు టెంకాయ కొట్టిన మంత్రి బుగ్గన
- బిల్లులు పెండింగ్‌తో పనులు ఆపేసిన కాంట్రాక్టర్

కోడుమూరు, ఏప్రిల్ 30: జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మారిచావా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 40 గ్రామాల ప్రజలకు రాకపోకలు కొనసాగే విధంగా కోడుమూరు మండలం గోరంట్ల కొత్తపల్లి హంద్రీనదిపై వంతెన నిర్మాణం చేపడతానని 2017 డిసెంబరు 25న పాదయాత్రలో సాక్షాత్తు జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ఓట్ల కోసం వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల అనంతరం 2023 జనవరి 24న గోరంట్ల, కొత్తపల్లి వంతెన నిర్మాణమంటూ ఎంతో ఆర్భాటంగా రాష్ట్ర మంత్రి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎంపీ సంజీవ్‌కుమార్ పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు శ్రీదేవి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అందరు కలిసి టెంకాయకొట్టి పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అంటూ సదరు కాంట్రాక్టర్ ఎంతో ఉల్లాసంగా పనులు చకచకా చేపట్టారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేసి వంతెన నిర్మాణం కోసం 19 పిల్లర్లు నిర్మించారు. అదిగో బిల్లు ఇదిగో అంటూ సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌ను ఊరించారు. ఏడు నెలలు బిల్లుల కోసం ఎదురు చూశాడు. కానీ ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ రాలేదు. దీంతో బిల్లు వస్తే తప్ప పనులు చేయలేనని కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. 2023 ఆగస్టులో పనులను నిలిపివేసిన సదరు కాంట్రాక్టర్ ఇంత వరకు పనుల వైపు తొంగి చూడలేదు.

జగన్ ఇచ్చిన హామీకే నిధుల కొరత :

కోడుమూరు మండలం గోరంట్ల - కొత్తపల్లి గ్రామాల హంద్రీనదిపై హైలెవల్ వంతెన నిర్మాణం అలాగే హంద్రీ నుంచి కొత్తపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.21 కోట్లు నిధులను విడుదల చేసింది. టెండర్ ప్రక్రియను వైఎంఆర్ కన్స్ట్రక్షన్ సంస్థ చేజిక్కించుకుంది. పీఐయూ పర్యవేక్షణలో ఎంతో వేగవంతంగా పనులను ప్రారంభించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ యంత్రాలను వదిలేసి కాంట్రాక్టర్ తట్టాబుట్ట సర్దుకొని పరార్ అయ్యాడు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామికే నిధుల కొరత అంటూ ప్రజలు ప్రజలు వైసీపీ ప్రభుత్వం విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.





పూర్తికానిగోరంట్ల - కొత్తపల్లి గ్రామాల మధ్య వంతెన పనులు

కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్

వైసీపీ ప్రభుత్వాన్ని నమ్ముకొని సదరు కాంట్రాక్టర్ గోరంట్ల-కొత్తపల్లి వంతెనతో పాటు కోడుమూరు నియోజకవర్గంలోని సుంకేసుల-కర్నూలు రోడ్డు, ముడుమలగుర్తి, బుడిదపాడు, గొందిపర్ల, బ్రహ్మణదొడ్డి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సమాచారం. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసినా ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ భారీ ఎత్తున నష్టపోయినట్లు తెలిసింది. బిల్లుల కోసం కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించి కొంత డబ్బును రాబట్టుకున్నట్లు సమాచారం.

50 ఏళ్లు దాటితే రూ.4 వేలు పింఛన్

భరోసా యాత్రలో టీజీ భరత్


వృద్ధురాలితో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 30: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో 50 ఏళ్ల దాటిన వారికి రూ. 4వేల పింఛన్ ఇస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 16 వ వార్డులోని స్వామిరెడ్డి నగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర పేరుతో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలు పెంచుతామని, 100 శాతం అంగవైకల్యం ఉంటే రూ. 15 వేలు అందిస్తామన్నారు. ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని సంపన్నులుగా మార్చేందుకు తమ తెలుగుదేశం ప్రభుత్వంలో కృషి చేస్తామన్నారు. నీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రూ. 10 లక్షల సబ్సిడీ ఇస్తామని, యువతకు ప్రతి సంవత్సరం 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చి భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు రామాంజనేయులు, బాబ్జీ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 30: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం కల్లూరు మండ లంలక్ష్మీపురం, పెద్దపాడు, అశ్వత్థపురం గ్రామాల్లో బైరెడ్డి శబరితో కలిసి గౌరు చరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు, రాష్ట్ర ప్రజల స్థితిగతులు మారడం ఖాయమన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించి 25 ఏళ్ళు వెనక్కి తీసుకెళ్ళారని ఆరోపించారు. అధికారంలోకి రావడానికి జగన్ ఇచ్చిన హామీలు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, మద్యపాన నిషేధం, ప్రతి ఏడాది జనవరిలో జాబ్‌క్యాలండర్, రైల్వేజోన్ అమలు కాలేదన్నారు.

టీడీపీలో చేరిన 50 కుటుంబాలు: ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండ, పుడిచెర్ల వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం ఓర్వకల్లుకు చెందిన 50 కుటుంబాలవారు పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

● ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన 20 కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత వారికి టీడీపీ కుండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. గుట్టపాడుకు చెందిన యువ ఓటర్లు గౌరుచరితను కలిసి మద్దతు తెలిపారు. రాజు, శేషాద్రి, రవితేజ, హేమంత్, మంజేనాథ్, ప్రేమ్‌కుమార్, రుక్మాంగదరెడ్డి ఉన్నారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన 10వ వార్డు వలంటీర్ సుమలత భర్త పక్కీరయ్యతో పాటు పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు.

● లక్ష్మీపురం గ్రామానికి చెందిన శ్రీహరి, బాస్కర్, వెంకటేశ్వరరెడ్డి, దేవదానం, వెంకటేశ్వర్లు, లాజర్, నాగచంద్రుడు, డేవిడ్, జాషువాతోపాటు 50 కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, పుల్లారెడ్డి, మారెన్న, రాధాకృష్ణారెడ్డి, శివ, పందిపాడు టీడీపీ నాయకులు శేఖర్‌చౌదరి దేవేందర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, ఉలిందకొండ టీడీపీ నాయకులు ఈవీ.రమణ, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, జవ్వాజి. గంగాధర్‌రగౌడ్, కాసాని మహేష్‌గౌడ్, దొడ్డిపాడు బాషా పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు చరిత, బైరెడ్డి శబరి

టీడీపీలోనే క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట: టీడీపీ హయాంలోనే క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట వేశారని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని వార్డ్ ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన పాణ్యం నియోజకవర్గ పాస్టర్స్ సంఘాల ఆత్మీయ సమావేశానికి గౌరు చరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, పాస్టర్‌లు విజయ్‌కుమార్, రమణ, అశోక్, నాగరాజు, ప్రేమానందం, డేవిడ్, ప్రదీప్, రాజేష్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీ కూటమి గెలుపు ఖాయం: గౌరు వెంకటరెడ్డి

రాష్ట్రంలో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయూస్ కాలనీ, గణేష్‌నగర్-2లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రక అవసరం


కోడుమూరులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి



కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 29: రాష్ట్ర భవిష్యత్తు తిరిగి గాడిలో పడాలంటే టీడీపీ కూటమి విజయం చారిత్రాత్మక అవసరమని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కోడుమూరు పట్టణంలో నాయకులతో కలిసి కొండ పేట, లక్ష్మీనగర్, బుడగజంగాల కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అని రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యరత్న, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, మాజీ సర్పంచులు సీబీ లత, రాంబాబుగౌడ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ క్రిష్ణారెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రఘుబాబు, ఆంధ్రయ్య, వీరేష్, యల్లప్పనాయుడు, సోమేష్, కట్టెల రాజు, బీజేపీ నాయకుడు వెల్పుల గోపాల్, జనసేన నాయకుడు ఆకెపోగు రాంబాబు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవిత్వంలో శ్రమైక జీవన సౌందర్యం


నివాళులు అర్పిస్తున్న గంగాధర రెడ్డి, సాహితీ వేత్తలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 30: మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో శ్రమైక జీవన సౌందర్యం ఉందని, ఆయన కర్షక, కార్మిక వర్గాల కవి అని పలువురు సాహితీ వేత్తలు కొనియాడారు. నగరంలోని తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో, మంగళవారం మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు సాహితీవేత్తలు, శ్రీశ్రీ అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత శ్రీశ్రీ చిత్ర పటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధరరెడ్డి, ప్రముఖ బాలల కథారచయిత డాక్టర్ ఎం. హరికిషన్, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వెంకటరాజారెడ్డి తదితరులు పుష్పమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం మహోన్నతంగా నిలుస్తుందని శ్లాఘించారు. భూస్వామ్య విధానం, పెట్టుబడిదారి విధానం పోవాలని తన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని చెప్పారు. డాక్టర్ చిన్నావుల వెంకటరాజారెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ విప్లవ కవిత్వంతోపాటు, అభ్యుదయ కవిత్వాన్ని, సినీ గీతాలను రాసి తెలుగు సాహిత్యంలో చరిత్ర సృష్టించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహాకవి శ్రీశ్రీ సాహిత్య సేవలను కవులు, కవయిత్రులు డాక్టర్ వి. పోతన్న, ఎలమర్తి రమణయ్య, జీవీ ప్రమోద్, జహీర్ అహ్మద్, హనుమంతప్ప, హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ చంద్రమౌళిని, సూర్యశ్రీ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ ప్రచార రథాలను డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు ప్రారంభించారు. మంగళవారం సాయంత్ర జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట జేండా ఊపి ప్రారం భించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, పీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ జిలానీ బాషా, నాయకులు వెంకటన్న, ఆనంత రత్నం మాదిగ, బి.బతుకన్న, సత్యనారాయణ గుప్త పాల్గొన్నారు.

30 ఏళ్లు దాటితే బీపీ పరీక్షలు తప్పనిసరి


శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 30: 30 సంవత్సరాలు దాటిన వారు తప్పని సరిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళశారం ఆయన గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని పసుపుల గ్రామంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, పంచాయతీ సెక్రటరీ హేమంత్ కుమార్, సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి నమ్రత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండో బ్యాలెట్ యూనిట్ కేటాయింపు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: కర్నూలు అసెంబ్లీ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ద్వారా రెండో బ్యాలెట్ యూనిట్ కేటాయింపు ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సప్లిమెంటరీ ఈవీఎం రాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16 మంది (నోటాతో కలిపి) కంటే ఎక్కువ మంది అభ్యర్థులు కర్నూలు అసెంబ్లీ, కర్నూలు పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తున్నారని తెలిపారు. గతంలో అన్ని నియోజకవర్గాలకు కేటాయించిన వాటికి రిజర్వులో ఉన్న 631 బ్యాలెట్ యూనిట్ల నుంచి 309 కర్నూలు అసెంబ్లీకి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేసి రెండు బ్యాలెట్ యూనిట్లు కేటాయించామన్నారు. కర్నూలు పార్లమెంటుకు అవసరమయ్యే బ్యాలెట్ యూనిట్లు బయట నుంచి వస్తాయని అన్నారు. మే 2, 3 తేదీలలో కర్నూలు అసెంబ్లీ కమిషనింగ్, 4, 5 తేదీల్లో కర్నూలు పార్లమెంటుకు కమిషనింగ్ చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీవో నాగరాజు నాయుడు, మున్సిపల్ సిబ్బంది, బీజేపీ ప్రతినిధి సాయిప్రదీప్, సీపీఎం ప్రతినిధి కేవీ నారాయణ, టీడీపీ ప్రతినిధి కె.నాగేంద్ర కుమార్, వైసీపీ ప్రతినిధి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కేవీఆర్ డిగ్రీ కళాశాలలో వస్తు ప్రదర్శన

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 30: కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం హస్తకళా వస్తు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీ ఆర్ సాయిగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థినులు హస్తకళల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. హోమ్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు చేనేత వస్త్రాలపై కుట్లు, అల్లికలు. ప్రింటింగ్, టై డైటింగ్‌తో రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అధ్యక్షత వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ సందర్శించారు. విద్యార్థినులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హోమ్ సైన్స విభాగాధిపతి డాక్టర్ ఆరతి చక్ర, అధ్యాపకులు ఝాన్సీ, వసంత పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: మల్లెల


కాల్వలో ప్రచారం చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 30: టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కోరారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం వైసీపీ ప్రభుత్వ లక్ష్యమ న్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం, రూ.4వేలు పింఛన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఖాదర్‌బాషా, నాయకులు రజాక్, గోకిరా బాషా, బక్సు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటి డెక్సా స్కాన్

న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ప్రారంభించిన కలెక్టర్


గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఎండో, కోలోనోస్కోపి యంత్రాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 30: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొట్టమొదటి డెక్సా స్కాన్‌ను రూ.36లక్షలతో న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేశామని కలెక్టర్ జి. సృజన పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌లో డెక్సాస్కాన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఎండోస్కోపి, అల్ట్రాసౌండ్ మిషన్ యంత్రాలను ఏంఎసీలో కొత్తగా ఏర్పాటు చేసిన 14 ఏసీలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ జిల్లా పర్చేజ్ కమిటీ ద్వారా పరికరాలను అత్యవసర రోగుల సౌకర్యార్థం కొనుగోలు చేశామని తెలిపారు. మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన డెక్సాస్కాన్ ద్వారా బోన్ మినరల్ డెన్సిటీ, కాల్షియం, టోటల్ బాడీఫాట్ పర్సంటైజ్ ఆర్థో, ఎండోక్రైనాలజీ రోగుల కాల్షియం స్థాయిని కనుక్కోవడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో రూ.32 లక్షలతో గ్యాస్ట్రో స్కోపి, కోలానోస్కోపి, ఈఆర్‌సీపీ స్కోపి యంత్రాలు, ఆల్ట్రాసౌండ్ మిషన్ వల్ల రోగులకు మెరుగైన వైద్యం అందుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఓర్వకల్లు, ఏప్రిల్ 30: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఓర్వక ల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, పుష్ప రాజు, అల్లాబాబు, అబ్దుల్లా, చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

5న అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 30: కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఉంటుందని అసోసియేషన్ కార్యదర్శి కే. దేవేంద్రగౌడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే జట్టును ఎంపిక చేస్తామ న్నారు. డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అసోసియేషన్ సిమేషన్ నెట్స్‌లో జరిగే ఎంపికకు ఆసక్తి ఉన్న క్రీడా కారులు పాల్గొనాలని ఆయన సూచించారు. 1.9.2005 తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులని, వివరాలకు 9959251047 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మేనిఫెస్టోలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 30: మేనిఫెస్టోలో ఆర్యవైశ్య సంక్షేమానికి కూటమి ప్రాధాన్యం కల్పించడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ కూటమి మ్యేనిఫెస్టో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించడం అభినందించ దగ్గ విషయమన్నారు. ఈసందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ కూటమి మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు.

రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పోర్టల్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 30: నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి తెలిపారు. గతంలో మాదిరి క్యూలైన్‌లో నిలబడకుండా ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పదో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, మెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయి పూర్తి వివరాలను మీ ఇంటి నుంచి మీ మొబైల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులకు మీ మెయిల్ ద్వారా జాబ్ మేళా వివరాలు, ఉద్యోగావకాశాలు తెలుసుకోవచ్చునని అన్నారు. 2023 -24 విద్యాసంవత్సరం నుంచి పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్ ఎంప్లాయి మెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

సి.బెళగల్, ఏప్రిల్ 30: మండలంలోని గుండ్రేవుల గ్రామంలో ఎంపీటీసీ నూర్జహాన్ అధ్వర్యంలో చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై మంగళవారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నూర్జహాన్ మాట్లాడుతూ జగన్‌కు ఒక్క చాన్స్ ఇవ్వడంతో రాష్ట్రాన్ని సర్వనాశం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, రసూల్, చాంద్‌బాషా, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, గంగన్న పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, ఏప్రిల్ 30: పింఛన్ల పంపిణీపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీ డీవో శంకుతల హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 3వ తేదీలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పింఛన్‌దారుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, ఆరోగ్యం సరిగా లేనివారికి ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారుడిని అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 30: విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లో రాణించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం మౌర్య ఇన్‌లోని ఆయన ఛాంబర్‌లో తైక్వాండో క్రీడలో ప్రతిభ చూపుతూ జిల్లా స్థాయిలో పతకాలు సాధిస్తున్న 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కె.కౌశిక్‌ను ఆయన అభినందించారు. భవిషత్తులోనూ మంచి ప్రతిభతో మరిన్ని పతకాలు సాధిం చాలని విద్యార్థిని, తైక్వాండో శిక్షకుడు టి.వెంకటేశ్వర్లును ఆయన ప్రశంసించారు.

విద్యుదాఘాత స్థలాన్ని పరిశీలించిన టీజీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 30: నగరంలోని అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో సోమవారం విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించి దెబ్బతిన్న డ్రెస్ సర్కిల్ రేమండ్స్ షోరూం ప్రాంతాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును, నష్టాన్ని షోరూం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వడం చాలా మంచిదైందని అన్నారు. ఆయన వెంట డ్రెస్ సర్కిల్ రేమండ్స్ షోరూంల అధినేతలు గోపాల్ రెడ్డి, వరుణ్ ఉన్నారు.

హ్యాండ్‌బాల్ ఎక్స్‌లెన్సీకి షేక్షావలి ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 30: గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో మే 3వ తేదీ నుంచి కొనసాగుతున్న సాయి స్పోర్ట్స్ హాస్టల్‌కు కర్నూలుకు చెందిన పి.షేక్షావలి ఎంపికైనట్లు రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ గాంధీనగర్‌లో జరిగిన దేశవ్యాప్త హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపికలో షేక్షావలి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక కావడం సంతోషమన్నారు. స్థానిక ఉస్మానియా కళాశాలలో షేక్షావలి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 10 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో, రెండుసార్లు జూనియర్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పాల్గొన్న అనుభవం ఉంది.

ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: రాష్ట్రంలో ఉన్న వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ వాల్మీకి యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకి బోయలకు ఎస్టీ పునరుద్ధరణ బిల్లును ఆమోదించాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

ఆదోని, ఏప్రిల్ 30: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులు సహకరించాలని ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల ఎన్నికల అబ్జర్వర్, సాధారణ ఎన్నికల పరిశీలకులు మిర్ తారిఖ్ ఆలీ అన్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.

వైసీపీ నాయకులు దోచుకుంటున్నారు : ఎమ్మార్పీఎస్

మద్దికెర, ఏప్రిల్ 30: మండలంలోని వైసీపీ నాయకులు కాంట్రాక్టు పేరుతో అక్రమాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పారా రాఘవేంద్ర ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మద్దికెర గ్రామంలోని వైసీపీ నాయకులు కాంట్రాక్టుల పేరుతో నాసిరకం పనులు చేస్తూ దోచుకుంటున్నారనీ ఆరోపించారు. మద్దికెర నుంచి బురుజుల గ్రామానికి ప్రభుత్వం రూ.30 లక్షలకు పైగా రోడ్డుకు మరమ్మతులు పనులు చేసేందుకు నిధులు మంజూరు చేస్తే తూతూ మంత్రంగా పనులు చేసి దోచుకున్నారనీ ఆరోపించారు. అంతేగాక మండలంలో జరిగిన సీసీ రోడ్ల పనుల్లో కూడా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. సాయినగర్, రామ్‌నగర్ కాలనీలో వేసిన రోడ్లు కూడా నాసిరకంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎం.అగ్రహారం ఆనంద్ కుమార్, పెడవలి రాము, తదితరులు ఉన్నారు.

మంత్రాలయం మఠం హుండీ ఆదాయం రూ.2.72 కోట్లు

మంత్రాలయం, ఏప్రిల్ 30: రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,71,83,973 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం మార్చి 2 రోజులతో పాటు ఏప్రిల్ 30 రోజులకు సంబంధించిన 32 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్స్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.2,71,83,973 నగదుతో పాటు 1.290 కేజీల వెండి, 41 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు.

గుండెపోటుతో రైతు మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 30: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన రైతు ఈడిగ పెద్ద నరసింహులు (56) గుండె పోటుతో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వచ్చి ఇంటి వద్దనే కుప్పకూలిపోయాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కొడుకులు, భార్య పద్మమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు, మాజీ సర్పంచు రఘునాథరెడ్డి, రైతు మృతదేహానికి నివాళి అర్పించారు.

మార్పు మొదలైంది..

వైసీపీ ఓటమి తథ్యం


పరమాన్‌దొడ్డి తండాలో సైకిల్‌తో ప్రచారం చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

- వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారు..
- టీడీపీ అధికారంలోకి వస్తేనే.. రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల విస్తృత ప్రచారం
- సాతనూరు వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

మంత్రాలయం, ఏప్రిల్ 30: ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజలందరూ విసిగి పోయారని, ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, ప్రజల్లో మార్పు మొదలైందని వైసీపీ ఓటమి తథ్యమని టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందని స్పష్టం చేశారు. మంగళవారం సింగరాజనహల్లి, పరమాన్‌దొడ్డి తండా, మాలపల్లి, సుంకేశ్వరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు లేక అవస్థలు పడుతున్నా.. స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మరోసారి వైసీపీ మాయమాటలకు మోసపోవద్దని కోరారు. టీడీపీ నాయకులు ఎస్ఎం గోపాల్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మాజీ సర్పంచ్ చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, చంద్ర, లక్ష్మన్న, వీరేష్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి టీడీపీ విజయం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. తన నివాసంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల క్లస్టర్, బూత్ లెవెల్ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. నాయకులు రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, వీరేష్‌గౌడు, హనుమంతు, రాగన్న, చిదానంద బూత్ లెవెల్ నాయకులు పాల్గొన్నారు.

బావ గెలుపు కోసం మరదళ్ల విస్తృత ప్రచారం : రాఘవేంద్రరెడ్డి గెలుపు కోసం ఆయన మరదళ్లు చంద్రిక, భారతి మంత్రాలయంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు పెట్టి రాఘవేంద్రరెడ్డిని గెలిపించాలని కోరారు. సుంకేశ్వరి గ్రామంలో సోదరుడు రఘునాథరెడ్డి, తనయుడు రాకేష్ రెడ్డి ప్రచారం చేశారు. నాయకులు కురువ రాగప్ప, దేవదాసు, అశోక్ రెడ్డి, వరదరాజులు, తెర్నేకల్లు రాఘవేంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దళిత కుటుంబాలు టీడీపీలో చేరిక

కోసిగి: సాతనూరు గ్రామంలో వైసీపీకి చెందిన పది దళిత కుటుంబాలు టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. దళిత నాయకులు నాగరాజు, శాంతరాజు, సామేల్, వినోద్, చిన్నరాజు, యేసేబు, తిక్కయ్య, వీరేష్, వీరన్న, హుశేనీ, చిన్నోడులు వైసీపీని వీడి టీడీపీ కండువాలు వేసుకున్నారు. తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి తమ దళిత కాలనీలవైపు కన్నెత్తి చూడలేదని, అందుకే ఇలాగైనా వీరిని ఓడించాలని టీడీపీలో చేరామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాతనూరు దళిత టీడీపీ నాయకులు రాజు, ప్రభు, కే.రాజు పాల్గొన్నారు.


క్లస్టర్, బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి


పల్లెపాడు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


మంత్రాలయంలో బావ గెలుపు కోసం ప్రచారం చేస్తున్న మరదళ్లు


రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన సాతనూరు దళిత నాయకులు

బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

మంత్రాలయం, ఏప్రిల్ 30: వైసీపీ ప్రభుత్వం బీసీలను ద్రోహం చేసిందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే బీసీల సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మాధవరం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం బీసీలను అన్ని విధాలుగా దగా చేసిందన్నారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క పైసా ఇవ్వకుండా కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. వాల్మీకి, కురువ సోదరులను పార్లమెంటుకు, అసెంబ్లీకి పంపాలని కోరారు. టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, సింగమల టీడీపీ సీనియర్ నాయకులు రవీంద్రలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దేవళ్ల మురళి, రాఘవేంద్రరెడ్డి

దళితుల ఆత్మీయ సమ్మేళనం

- దళితుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
- వ్యవసాయ మార్కెట్‌లో విస్తృత ప్రచారం
- మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తా : బీవీ
- 400 కుటుంబాలు టీడీపీలో చేరిక


దళితుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, హాజరైన దళితులు


దళితుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దళిత సమంక్షేమం టీడీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు రుణాలు, వాహనాలు ఇప్పించి వారికి ఉపాధి కల్పించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో పేరుకు మాత్రమే కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్క రుపాయి కూడా దళితులకు అందించిన పాపానపోలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని రకాలుగా దళితుల అభ్యున్నతికి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు శ్రీరాములు, గోనెగండ్ల సర్పంచు హైమావతి, టీడీపీ నాయకులు సుందర్‌రాజు, దావీదు, మధుబాబు, అంబేడ్కర్, ఈరన్న, కదిరికోట షాలేము, ఎన్డీయే కూటమి నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.


కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బీవీ

మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తా : బీవీ

కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం టీడీపీ హయాంలో రూ.కోట్లరుపాయలు తెచ్చినా వైసీపీ ప్రభుత్వం వినియోగించుకోక అసమమర్థత చాటుకొందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కూరగాయల మార్కెట్‌లో బీవీ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులను కలుసుకొని ఓటు అభ్యర్థించారు. తాను అధికారంలోకి వస్తే కూరగాయల మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కొంతమంది మహిళలు తమకు స్థలంలేకపోవడంతో మార్కెట్ మధ్యలో రోడ్డుపైనే వ్యాపారాలు చేసుకుంటున్నామని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. అధికారంలోకి రాగానే అందరి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


మార్కెట్‌యార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న బీవీ



400 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండదల పరిధిలోని మల్కాపురం, సిరాలదొడ్డి, గోనెగండ్ల మండలంలోని పెద్దమర్రివీడు, బైలుప్పల, పిల్లిగుండ్ల, ఎన్నెకండ్ల గ్రామాలకు చెందిన దాదాపు 400 కుటుంబాలు బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి బీవీ జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బోయ బజారి, దాసరి బజారి, రాళ్లదొడ్డి మురళి, చెన్నారెడ్డి, పాండు, రాజశేఖర్, చంద్రన్న, రాజమౌలాలి, బడేసాహెబ్, మధు పాల్గొన్నారు.



జగన్ ప్రభుత్వాన్ని సాగనంపండి

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


చుంచు ఎర్రగుడిలో బస్తిపాటి నాగరాజు, శ్యాంబాబుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

క్రిష్ణగిరి, ఏప్రిల్ 30: దుర్మార్గ పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఇక సాగనంపాలని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. క్రిష్ణగిరి మండలంలోని చుంచు ఎర్రగుడి, సంగాల, ఆగవేలి, పోతుగల్లు, జీమల్లాపురం గ్రామాల్లో బస్తిపాటి నాగరాజు.. పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యాంబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ... టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ హయాంలో జరిగింది శూన్యమన్నారు. నవరత్నాలు అంటూ గొప్పలు చెబుతున్న వైసీపీ నవ మోసాలు చేసిందన్నారు. అమ్మఒడి ఇద్దరి పిల్లలకు ఇస్తామని చెప్పి ఒకరికే ఇచ్చి దారుణంగా మోసం చేసిందని, అందులో కూడా 2 వేలు తగ్గించి తల్లిదండ్రులను వంచించిందన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి యువతను నట్టేట ముంచిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జగన్ పాలనలో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలకు త్వరలో చంద్రబాబు సుస్థిర పాలనను అందజేస్తాడని వెల్లడించారు. ఇకపై చెత్తపన్ను, నీటి పన్ను, బాదుడులాంటివి ఉండవన్నారు. ఈ సందర్భంగా సంగాల, క్రిష్ణగిరికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

వైసీపీ నుండి టీడీపీలోకి చేరిక


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని, ఏప్రిల్ 30: ఆదోని పట్టణంలోని 10వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ దస్తగిరి మంగళవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు ఆ కాలనీకి చెందిన మరో 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారిని మీనాక్షినాయుడు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామని అన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం

- ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్
- చిప్పగిరి మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

చిప్పగిరి, ఏప్రిల్ 30: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం చిప్పగిరి మండలం నేమకల్, తిమ్మాపురం, నగర డోణ, రామదుర్గం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. ఎన్నికల హామీలను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. ఆలూరు ప్రాంతంలో వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్‌ను ఆధునికీకరణ చేసి హెచ్ఎల్ఎసీ ద్వారా పంటలకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీనాక్షినాయుడు, మండల కన్వీనర్ వలి, నాయకులు వెంకటేష్, రజినీ, కొండా గోవింద్, పెద్దన్న, పోతురాజు, రాముడు, రవియాదవ్, రామచంద్ర, అంపయ్య, సన్నప్ప, తిమ్మయ్య, ఎల్లంకి నాగరాజ్, గోవిందన్న, రామయ్య, ఎర్రన్న, బంగారు ప్రతాప్, మిరపకాయల చంద్రన్న, సర్పంచులు పురుషోత్తం, సుశీలమ్మ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్

● వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక...

వైసీపీ నాయకులు పోతురాజు, రాముడు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీని ఆదరించండి

● టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి

ఆలూరు, ఏప్రిల్ 30: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజుకే ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఆలూరు మండలం తుంబళబీడు, అగ్రహారం, కురువళ్లి గ్రామలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పెన్షన్ రూ.4వేలు పెరుగుతుందన్నారు. అలాగే రైతులకు ఏడాదికి రూ.20వేలు, మహిళలకు 3 సలిండర్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును సీఎం చేయాలంటే సైకిల్ గుర్తుకే కేటు వేయాలని కోరారు. సర్పంచులు నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కురవళిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి